క్లుప్తంగా

కొల్లేరుకు కొనసాగుతున్న వరద



పడమట లాకుల వద్ద పారుతున్న వరదనీరు

ఏలూరు రూరల్ : కొల్లేరులోకి వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం సైతం తూర్పు, పడమట లాకుల మీదగా వందల క్యూసెక్కుల నీరు కొల్లేరు సరస్సుకు చేరుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు పెద్ద ఎత్తున తమ్మిలేరు గుండా ఏలూరుకు చేరుతోంది. దీన్ని గుర్తించిన ఇరిగేషన్ అధికారులు లాకుల గేట్లు మరింత ఎత్తుకు పెంచి మరింత నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది జూలై నెల ఆఖరి వారంలో తమ్మిలేరుకు రెండు రోజులు వరద నీరు పారింది. మళ్లీ వారం రోజులు కాక ముందే బుధవారం నుంచి మరోసారి వరదనీరు ప్రవాహం ప్రారంభమైంది. నాలుగురోజుల పాటు పారుతున్న వరదనీటితో కొల్లేరుకు జలకళ వచ్చింది.

హాజరు నూరు శాతం ఉండాలి



సమీక్ష చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): విద్యార్థుల హాజరు శాతం నూరు శాతం ఉండేలా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో విద్యా శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలలకు నూరు శాతం హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం వెళ్లాలన్నారు. బడి మానేసిన వారు తిరిగి బడిలో చేరేలా ఉపాధ్యాయులు, ఉద్యోగులు అందరూ తల్లిదండ్రులకు నచ్చచెప్పాలన్నారు. కార్యక్రమంలో డీఈవో అబ్రహం, జెడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడులకు కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా

ఏలూరు(మెట్రో): శిక్షణలో నేర్చుకున్న అంశాలను రైతులకు తెలిపి నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ అధికారులు కృషిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. శనివారం ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏడు మండలాల వ్యవసాయ సహాయక సంచాలకులకు శిక్షణ, ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ పరిస్థితులు, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డా.కె.ఫణికుమార్ వరిలో ఆకు ముడత, ఎండాకు తెగులు నివారణకు, నేరుగా వెదజల్లే వరిలో కలుపు యాజమాన్యం గురించి తెలిపారు. విజయరాయి ప్రధాన శాస్త్రవేత్త డా.పి.వి.రమణారావు, డీఆర్సీ సహాయ వ్యవసాయ సంచాలకులు పి.లలిత సుధ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక వెంకన్న చెరువు సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం ఆదివారం నగరంలోని వివిధప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం సెంటర్, 7 కాలువల సెంటర్, చాటపర్రు రోడ్డు, తూర్పువీధి సాయి బాబా గుడి సెంటర్, తూర్పువీధి గంగానమ్మ గుడి ప్రాంతం, ఫిల్‌హౌస్ పేట, వీవర్స్ కాలనీ, అరుంధతి పేట, పడమర వీధి దొంగల మండపం ప్రాంతం, కందకం రోడ్డు, దక్షిణపు వీధి, శనగపప్పు బజారు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు.

రేపు ధ్యానంపై శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సరైన ధ్యానంతో సజ్జన సాంగత్యం అనే అంశంపై ఏలూరులో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ స్థానిక ప్రతినిధి కూర్మాల లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గులాబితోటలో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు శ్రీకాళహస్తికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్, పిరమిడ్ గృహస్తి ఆశ్రమ నిర్వాహకులు ఎస్ మునిబాబు ధ్యానంపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొనే వారికి మధ్యాహ్నం సాత్విక శాఖాహార భోజనం ఏర్పాటు చేసినట్టు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను విస్తరించాలి

- ఏలూరు నగరంలో మూడు సెంటర్లకే పరిమితం
- జూట్‌మిల్లు సెంటర్‌లో పనిచేయని వైనం
- వాహనాల రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య



ఏలూరు నగరంలో ట్రాఫిక్ సిగ్నలింగ్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. పెరుగుతోన్న నగర జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ లేకపోవటం, కార్లు, మోటారు సైకిళ్ల వినియోగం మరింత ఎక్కువై ట్రాఫిక్ సమస్యను జటిలం చేస్తున్నాయి. ఏలూరు నగర జనాభా ప్రస్తుతం 3.25 లక్షలకు పైమాటే. ఏలూరు కార్పొరేషన్‌లో ఏడు పంచాయతీలు విలీనమయ్యాయి. జిల్లా కేంద్రం కావటంతో రోజూ నగరానికి వేలాది మంది నగరంలోకి ఆయా పనుల నిమిత్తం వస్తుంటారు. ఏలూరు నగరం విస్తరిస్తున్నా.. ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ పూర్తి స్థాయిలో అభివృద్ధి కాలేదు. నగరంలో మూడు ప్రాంతాల్లో మాత్రమే ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీటిలో ఫైర్ స్టేషన్ సెంటర్, పాతబస్టాండ్ సెంటర్‌లో మాత్రమే సిగ్నలింగ్ పనిచేస్తోంది. జూట్‌మిల్లు సెంటర్‌లో ఏర్పాటు చేసినా వినియోగించే పరిస్థితి లేదు. ఏలూరులో శాంతినగర్, అమీనాపేట లూథరన్ చర్చి ఏరియా, అశోక్‌నగర్ బ్రిడ్జి ప్రాంతం, కండ్రికగూడెం సెంటర్, సెయింట్ ఆన్స్ కళాశాల సెంటర్‌లో నిత్యం రోడ్లు రద్దీగా ఉంటాయి. ఈ ప్రాంతాల్లో సరైన విధానంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ లేకపోవటంతో సమస్య ఉత్పన్నం అవుతోందనే ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సిగ్నలింగ్ వ్యవస్థ ఆవిర్భావం ఇలా..

ట్రాఫిక్ సిగ్నలింగ్ దినోత్సవాన్ని ప్రతి ఏటా ఆగస్టు 5న నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. తొలి విద్యుత్ ట్రాఫిక్ లైట్‌ను 1914 ఆగస్టు 5న క్లేవ్ ల్యాండ్, ఓహియోలో ఏర్పాటు చేశారు. ఆధునిక సామాజిక పరిస్థితులు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ప్రారంభించారు. దీని కంటే ముందే 1912లో సాల్ట్‌లేక్ సిటీలో రెడ్, గ్రీన్ లైట్లతో ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేశారు. ఒక స్తంభంపై చెక్కపెట్టలో లైట్స్‌ను ఏర్పాటు చేశారు. దక్షిణ భారత దేశంలో మొట్టమొదటి సారిగా చెన్నై మహానగరంలో ఎగ్మోర్ జంక్షన్‌లో 1953లో ట్రాఫిక్ సిగ్నలింగ్‌ను ప్రారంభించారు. అనంతరం 1963లో బెంగుళూరులో కార్పొరేషన్ సర్కిల్‌లో ట్రాఫిక్ సిగ్నల్ లైట్స్‌ను ఏర్పాటు చేశారు.

నిబంధనలు పాటించాలి



ఏలూరు నగరంలో ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు విద్యార్థులకు, యువతకు స్కూల్స్, కాలేజీల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాం. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాం.

– కె.శ్రీనివాసరావు, ఏలూరు ట్రాఫిక్ సీఐ

చైతన్యవంతులను చేయాలి



రోడ్డు ప్రమాదాల నివారణకు ముందుగా చట్టాలు, నిబంధనలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలి. ట్రాఫిక్ సిగ్నలింగ్‌పై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలి. రోడ్డు ప్రమాదానికి గురైతే అంగవైకల్యం, ఆర్థిక నష్టం, ఉపాధి కోల్పోవటం జరుగుతుందనే విషయాన్ని గ్రహించేలా అవగాహన కల్పించాలి.

– చలసాని వెంకట సురేంద్ర, సామాజిక కార్యకర్త

హాస్టల్ వద్ద రోడ్డును బాగుచేయాలి



బురదమయమైన రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు

ఏలూరు(ఆర్ఆర్‌పేట) : స్థానిక అమీనాపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం వద్ద బురదమయమైన రోడ్డును తక్షణమే బాగుచేయించాలని సాంఘిక సంక్షేమశాఖ విశ్రాంత ఉద్యోగి దుగ్గిపోగు రాజాలాల్ ఒక ప్రకటనలో అధికారులను కోరారు. అమీనాపేట ప్రాంతంలో ఆరు హాస్టల్స్ ఉన్నాయని, అందులో ఎలిమెంటరీ, హైస్కూల్, కళాశాల విద్యార్థినులు సుమారు 1300 మంది ఉంటున్నారని పేర్కొన్నారు. వారంతా ఈ రోడ్డుపై నడవటానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే విద్యుత్ శాఖకు సంబంధించిన ఏలూరు విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులు, ప్రజలు, బాలయోగి సైన్స్‌పార్కుకు వెళ్లే ప్రజలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. విద్యార్థినులు బురదలో జారిపడి గాయాలపాలవుతున్నారని తెలిపారు.

వైభవంగా నర్తనబాల అవార్డుల మహోత్సవం









ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్య సంస్థ అభినయ నృత్యభారతి ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఏ హాలులో 9వ జాతీయ స్థాయి నర్తనబాల అవార్డుల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం 8 గంటల వరకు 83 మంది చిన్నారులు తమ నృత్య కౌశల్యాన్ని ప్రదర్శించి నర్తనబాల అవార్డులు స్వీకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 45 మంది విద్యార్థులు ఈ ఉత్సవాలలో పాల్గొంటున్నారు. మొదటి రోజు కార్యక్రమానికి అతిథులుగా మానవత విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, త్రినాథ్ ఫ్యాషన్స్ అధినేత శలా రాజాబాబు, వైఎంహెచ్ఏ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ మజ్జి కాంతారావు, వెయిట్ లిఫ్టింగ్ అంతర్జాతీయ శిక్షకుడు బడేటి వెంకటరామయ్య, రిటైర్డ్ పోలీస్ అధికారి పేరాబత్తుల రాంబాబు, సకల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దువ్వి రామారావు తదితరులు పాల్గొని అవార్డులు అందించారు.





చిన్నారిని సత్కరిస్తున్న దృశ్యం

నాయకత్వంతో బాధ్యత



విద్యార్థి సంఘం నాయకురాలిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విద్యార్థినులకు నాయకత్వంతో బాధ్యత ఏర్పడుతుందని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.నిర్మల కుమారి అన్నారు. స్థానిక సెయింట్ థెరెసా స్వయం ప్రతిపత్తి మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విద్యార్థిని సంఘ ప్రతినిధుల నాయకత్వ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కళాశాల విద్యతో పాటు విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తుందని, తాను, తన ఇద్దరి సోదరీమణులు ఈ కళాశాల పూర్వ విద్యార్థినులమేనని గుర్తుచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ కళాశాల విద్యార్థి సంఘ నూతన కార్యవర్గ అధ్యక్షురాలుగా లిసా జోస్, ఉపాధ్యక్షురాలుగా కుసుమ శ్రీ, కార్యదర్శిగా జ్ఞానిజైన్, ఉప కార్యదర్శిగా నందిని, పీజీ విద్యార్థి సంఘ నాయకురాలిగా సృజన, కార్యదర్శిగా లక్ష్మీ ప్రియాంకలు ఎంపికయ్యారని తెలిపారు. కార్యవర్గ ప్రతినిధులను వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ క్రిస్టియ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల అభినందించారు. కళాశాల విద్యార్థిని సంఘ కార్యదర్శి జ్ఞానీ కార్యక్రమాల నివేదికను సమర్పించారు. కళాశాల విద్యార్థి నాయకుల అధ్యక్షురాలు లిసా జోశ్ నూతన విద్యార్థిని కార్యవర్గ ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. నిర్మల కుమారిని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు సత్కరించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థుల్లో సేవానిరతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ స్వీయ క్రమశిక్షణ, సేవానిరతిని పెంపొందిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. స్థానిక ఈదర సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఓరియంటేషన్ తరగతులు శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అబ్రహం మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ వల్ల పోటీ పరీక్షల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ప్రతి పాఠశాలలోనూ యూనిట్లు ప్రారంభించాలని పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి ఏవీఎస్ఎన్ భాస్కర్‌కుమార్ కోర్సుల వివరాలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు పీ కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న అధ్యక్షులు కురమా ఆనంద్‌కుమార్

ఏలూరు(ఆర్ఆర్‌పేట): ఏటా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ స్కూళ్లల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన వారికి ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ నగర శాఖ అధ్యక్షుడు కురమా ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం స్థానిక తూర్పువీధి నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ నగర శాఖ సమావేశం నిర్వహించారు. సంఘ ఉపాధ్యక్షులు మేరుగు విలియం బెనర్జీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. జిల్లా కౌన్సిలర్ వీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జీఓ-84, 117ను రద్దు చేయాలని కోరారు. మరో జిల్లా కౌన్సిలర్ డి.కేదారేశ్వరస్వామి మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల నుంచి ప్రస్తుత జీపీఎఫ్ ఖాతాల్లోకి నగదు మార్చాలని కోరారు. ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు సాధ్యమైనంత త్వరితగతిన మండల పరిధిలోనే పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జిల్లా కౌన్సిలర్ కె.కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు స్పౌజ్, మ్యూచ్యువల్ వారికి అంతర్ జిల్లాల బదిలీలు, ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు నిర్వహించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎంఎస్ఎన్ మూర్తి, చింతా వెంకటరత్నం, ఎ.సాంబమూర్తి, ఎ.జోజిబాబు, జి.రాజారావు, తొమ్మండ్రు ప్రకాష్, ఎస్ఎస్ ప్రతాప్, జె.శాంతకుమార్ పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి తెలిపారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆదేశాల మేరకు స్టాప్ డయేరియా ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రతి డివిజన్‌లోనూ దోమల నిరోధానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం స్థానిక 20వ డివిజన్‌లో నరసింహారావుపేట, గ్రాండ్ అర్మ్యా రోడ్డు, రైల్వే ట్రాక్‌రోడ్డు, డాక్టర్ జగన్మోహన రావు వీధి తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు మురుగు కాలువలు, కల్వర్టుల కింద ఫాగింగ్ చేశామని, ఖాళీ స్థలాల్లోని నీటినిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేశామని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీటి తొట్టెల్లో నీరు నిల్వ చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. మంచినీటి నిల్వ ప్రాంతాల్లో డెంగీ కారక దోమ పెరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాలస్వామి, మలేరియా సూపర్‌వైజర్ దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు, స్థానిక నాయకుడు నాగేశ్వరరావు, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తల్లి పాలు బిడ్డ ఎదుగుదలకు అవసరమని, ప్రతి తల్లి, బిడ్డకు పాలిచ్చే సంస్కృతిని ప్రోత్సాహిద్దామని డాక్టర్ నిఖిత అన్నారు. ఐసీడీఎస్ ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని ఖండ్రికగూడెం అర్బన్ హెల్త్ సెంటరులో ప్రపంచ తల్లిపాల వారోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరు సీడీపీఓ ఎ.పద్మావతి మాట్లాడుతూ ముర్రుపాలు బిడ్డకు అమృతం వంటిదని, ప్రభుత్వం గర్భిణీకి, బాలింతకు ఇచ్చే కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.మంగ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా కేంద్ర గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణానికి అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబుకు సూచించారు. శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రతినిధులు జేసీని ఆమె చాంబర్‌లో కలిసి గ్రంథాలయ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన శిథిలావస్థలో ఉందని, దాని స్థానంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు. ఏలూరు నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని వివిధ మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీల నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ బకాయిలు వెంటనే వచ్చేలా ఏర్పాట్లు చేస్తే జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి పనులు చేసుకోవచ్చని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తాను జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని పరిశీలిస్తానని వారికి చెప్పి, కొద్ది గంటల్లోనే జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకుడు కె.నారాయణరావు, సహాయ గ్రంథ పాలకులు వీటీ సందీప్‌కుమార్, కేంద్ర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త ప్రభుత్వంలో స్కీం వర్కర్లపై వేధింపులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్కీం వర్కర్లు, చిరుద్యోగులపై కొత్త ప్రభుత్వం వచ్చాక వేధింపులు పెరిగాయని వాటిని తక్షణ జ నిలుపుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ నెల 5న సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏలూరులో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం చిరుద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఓట్లు వేసిన సాధారణ ప్రజలపై ప్రతాపం చూపడం సరికాదని వారు హితవు పలికారు. జిల్లాలో ఇప్పటికే వందలాదిమంది మధ్యాహ్న భోజన కార్మికులను, వెలుగు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న వీవోఏలను పట్టణాల్లో పనిచేసే ఆర్పీలను కొన్నిచోట్ల అంగన్‌వాడీలను, ఆశాలను రాజకీయంగా వేధిస్తున్నారని అక్రమంగా తొలగిస్తున్నారని తక్షణమే అక్రమ తొలగింపులు ఆపాలని కోరుతూ సోమవారం ధర్నా చేపట్టినట్లు తెలిపారు.

ఉద్యాన పంటల అభివృద్ధికి కృషి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా పరిధిలో 2024-25 సంవత్సరంలో ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామ్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్ పాం పథకంలో మొక్కకు రూ.193 చొప్పున హెక్టారుకు రూ.29,000 ప్రభుత్వ రాయితీ ఇస్తుందని, ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై పథకాల కింద హెక్టారుకు మామిడి రూ.7,980, కోకో రూ.12,000, జీడిమామిడి రూ.12,000, బత్తాయి/నిమ్మ రూ.9620, డ్రాగన్‌ఫ్రూట్‌కి రూ.30,000, కూరగాయలకు రూ.20,000, ప్లాస్టిక్ మాల్చింగ్ కవర్ల కోసం రూ.16,000, ఆర్‌కేవీవై - పందిర్ల సాగుకు రూ.2,50,000 రాయితీ ఇస్తున్నామన్నారు. రైతులు రైతు సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.